సాక్షి
వికారాబాద్

గురువారం • 29 • మే • 2025



ప్రతి నిరుద్యోగికీ..

ప్రతి నిరుద్యోగికీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. 8లో▸



తప్పని విత్తన భారం

గత ఏడాదితో పోలిస్తే ఈ సారి జీలుగ విత్తనాల ధర రెట్టింపయ్యాయి. దీంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. 9లో▸



సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. 9లో▸

న్యూస్‌రీల్

జూన్ 3నుంచి కంది విత్తనాల పంపిణీ

తాండూరు: తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో 365 క్వింటాళ్ల కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. జూన్ 3న సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయనున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. టీడీఆర్‌జీ 59 రకం కంది విత్తనాలు 350 క్వింటాళ్లు, ఆశ ఐసీపీఎల్ 87119 రకం 15 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. 4 కిలోల బస్తాను రూ.600కు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆశ రకం నల్లరేగడి, నీటి వసతి ఉన్న భూముల్లో విత్తుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ రకం ఎండు తెగులు, వెర్రి తెగులు, గొడ్డు తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని వివరించారు. విత్తనాలు కావాల్సిన రైతులు జూన్ 3న తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

మహనీయుడు వీర సావార్కర్

బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: బ్రిటీష్ రాచరిక పాలనకు వ్యతిరేకంగా దేశంలోని హిందువులను ఏకం చేసిన మహనీయుడు వీర సావార్కర్ అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం అన్నారు. బుధవారం తాండూరులో పార్టీ ఆధ్వర్యంలో సావార్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం యూకేలో చదువుతున్న ఆయన పలు విప్లవ సంస్థలతో సంబంధాలు ఏర్పర్చుకుని బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా హిందువులను ఏకం చేశారన్నారు. దీంతో బ్రిటీష్ వారు ఆయనను అరెస్టు చేసి ఇండియాకు తీసుకువచ్చి అండమాన్ దీవుల్లోని సెల్యులార్ జైలుకు పంపారన్నారు. జైలు నుంచి విడుదలైన ఆయన హిందూ జాతీయ వాదాన్ని సమర్థిస్తూ స్వాతంత్ర్యం కోసం పోరాడాడన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రజినీకాంత్, మంతటి రాజు, ప్రకాష్, ప్రహ్లాద్, షాబుద్దీన్, శివాజీ, తాండ్ర నరేష్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి



బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని విలియంమూన్ మైదానంలో జీఎంకే బిల్డర్ అండ్ డెవలపర్స్ అధినేత ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. సమాజ సేవ అలవాటు చేసుకోవాలన్నారు. వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 40 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



గిరిగెట్‌పల్లిలోని ఓ రైతు పొలంలో ప్రవహిస్తున్న వరద



వికారాబాద్ రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న చిట్టంపల్లి వాగు

వికారాబాద్‌లో కుండపోత

వికారాబాద్ పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడతెరిపి లేని వానతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. – అనంతగిరి

50,406 దరఖాస్తులు

జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి వచ్చిన అర్జీలు

- వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపు పూర్తి
- మండలస్థాయిలోనే లబ్ధిదారుల ఎంపిక
- ప్రొసీడింగుల తయారీలో అధికారులు బిజీ
- రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా పథకం అమలు
- ఒక్కో యూనిట్‌కు గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు..
- 70 నుంచి 90శాతం వరకు రాయితీ



వికారాబాద్: జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకం కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల 14వ తేదీ వరకు యువత నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఎంపీడీఓల పర్యవేక్షణలో పరిశీలనను పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రొసీడింగులు తయారీలో నిమగ్నమయ్యారు. జూన్ ఒకటిలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతకంతో కూడిన ప్రొసీడింగులు జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని లబ్ధిదారులకు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అత్యధికంగా తాండూరు నుంచి..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల నుంచి రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు స్వీకరించారు. అత్యధికంగా తాండూరు మండలంలో 3,456 మంది యువకులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోగా కొడంగల్ మున్సిపాలిటీలో అత్యల్పంగా 760 మంది మాత్రమే అర్జీలు ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించిన ప్రభుత్వం వచ్చిన వాటిని మండలాలు, మున్సిపాలిటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల వారీగా విభజించి వెరిఫికేషన్ పూర్తి చేశారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల నుంచి 50,406 దరఖాస్తులు వచ్చాయి. లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న యూనిట్ ధరను బట్టి రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రాయితీపై రుణాలు అందజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనే తేడా లేకుండా అన్ని సామాజిక వర్గాల వారికి ఒకే రకమైన రాయితీ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రూ.లక్ష వరకు 90శాతం రాయితీపై రుణాలు అందజేయనున్నారు. రూ.2 లక్షల వరకు 80శాతం రాయితీ వర్తించనుండగా రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు రుణం పొందే వారికి 70 శాతం రాయితీ వర్తించనుంది.

ఎంపికలో తర్జన భర్జన

మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ చేపడుతుండగా.. ఇందులో బ్యాంకర్లను కూడా భాగస్వాములను చేస్తున్నారు. అయితే బ్యాంకు సిబిల్ స్కోర్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఎంపిక ప్రక్రియలో తమ ప్రమేయం ఏమీలేదని.. అంతా పారదర్శకంగా చేపడుతున్నామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు పేర్కొంటున్నారు. అయితే నేతల కనుసన్నల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతున్నట్లు సమాచారం. దీంతో దరఖాస్తు చేసుకున్న యువకులు ఎమ్మెల్యేలు.. అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల రూ.3లక్షలు, రూ.4 లక్షల యూనిట్లు మంజూరు చేయాలంటే తమ చేతులు తడపాలని కొందరు నేతలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలాల వారీగా..

మండలం పేరు	వచ్చిన దరఖాస్తులు
బంట్వారం	1,182
బషీరాబాద్	2,125
బొంరాస్‌పేట్	2,180
చౌడాపూర్	1,741
ధారూరు	2,380
దోమ	3,136
దౌల్తాబాద్	1,971
దుద్యాల్	1,904
కొడంగల్	2,156
కొడంగల్(మున్సిపల్)	760
కోట్‌పల్లి	1,141
కుల్కచర్ల	3,311
మర్పల్లి	1,964
మోమిన్‌పేట్	1,804
నవాబుపేట్	1,494
పరిగి	2,615
పరిగి(మున్సిపల్)	604
పెద్దేముల్	3,200
పూడూరు	2,320
తాండూరు	3,456
తాండూరు(అర్బన్)	2,350
వికారాబాద్	1,423
వికారాబాద్(అర్బన్)	2,903
యాలాల	2,286
మొత్తం	50,406



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

రైతులకు నష్టం కలిగించొద్దు

- ధాన్యం బస్తాలను తక్షణం మిల్లులకు తరలించండి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: వర్షాలు పడుతున్నందున కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ధాన్యం తడిసి రైతులకు నష్టం జరగకుండా చూసుకోవాల్సి బాధ్యత మనపై ఉందని అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ధాన్యం సేకరణ, రవాణాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున ధాన్యం ఆరబెట్టుకోవడం రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నా అన్నదాతలకు నష్టం జరగకుండా సేకరించిన వడ్లను మిల్లర్లకు తరలించాలని ఆదేశించారు. ఇందుకోసం లారీలు, హమాలీలను సమకూర్చుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఎంసీఎస్ రాము, రవాణా శాఖ జిల్లా అధికారి వెంకట్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారులు, ట్రాన్స్‌పోర్టర్లు పాల్గొన్నారు.

తడిసినా కొనుగోలు చేయాలి

ధారూరు: ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున ధాన్యం తడిసినా సేకరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. బుధవారం ధారూరు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. అక్కడ రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరిస్తున్న హరిదాస్‌పల్లి పీఏసీఎస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. అలాగే సేకరించిన వడ్ల బస్తాలను వెనువెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, సీఈఓ రవి తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా నేరం



సమావేశంలో పాల్గొన్న పోలీసు, పశుసంవర్ధక శాఖ అధికారులు

ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో పశువుల అక్రమ రవాణాను నిరోధించాలని ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో పోలీసు, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న బక్రీద్ పండుగ ఉన్నందున పశువులను అక్రమ రవాణా చేయకుండా నిఘా పెంచాలని ఆదేశించారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 8 ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. చట్టవిరుద్ధంగా పశువులను రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పశువుల క్రయ విక్రయాలు జరిపే రైతులు, వ్యాపారులు సంబంధిత గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ అధికారులచే ధ్రువీకరించిన రశీదులను తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందన్నారు. లేని పక్షంలో చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. పశువుల అక్రమ రవాణా విషయం తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెటర్నరీ అధికారి సదానందం, వికారాబాద్, తాండూరు, పరిగి డివిజన్ల డీఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేద్దామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చంద్రవంచ, మిట్టబాసుపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చంద్రవంచ గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనా పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. హనుమాన్ ఆలయ చైర్మన్ పదవి ఖాళీగా ఉందని.. భర్తీ చేయాలని కోరారు. స్థానిక ఎన్నికల తర్వాత చైర్మన్ పదవిని భర్తీ చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మిట్టబాసుపల్లిలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని.. మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఆ గ్రామ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే మసీదు నిర్మాణానికి సహకరించాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, అంజిలప్ప, అనంతప్ప, నర్సింలు, ఎల్లప్ప, జగదీష్, మల్లప్ప, ఇస్మాయిల్, పెద్ద ఇస్మాయిల్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ట్రయినీ అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి



అనంతగిరి: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) తెలంగాణ వారి ఆధ్వర్యంలోని వివిధ క్రీడా అకాడమీ మరియు వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 2025 - 26 సంవత్సరానికి గాను అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, సైక్లింగ్, రెజ్లింగ్, హాకీ, హ్యాండ్ బాల్, వాలీబాల్ విభాగాల్లో బాలబాలికల ప్రవేశాల కోసం ఎంపిక నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో అర్హులైన, ఆసక్తి గల బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం చదువుతున్న స్కూల్, కాలేజీ బోనఫైడ్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, క్రీడా ధ్రువీకరణ పత్రాలు, 10 పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో ఉదయం 7గంటలకు ఎంపిక ప్రదేశాలకు హాజరు కావాలన్నారు. వాలీబాల్‌కు సంబంధించి జూన్ 1 సిద్దిపేట జిల్లా వాలీబాల్ అకాడమీలో, జూన్ 10న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో, రాజన్న సిరిసిల్ల మినీ స్టేడియం, వాలీబాల్ అకాడమీలో, జూన్ 12, 13న మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియం మైదానంలో, ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. జూన్ 10, 11న సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీ వెలోడ్రోమ్, ఓయూ క్యాంపస్, హైదరాబాద్, ప్రాంతీయ క్రీడా వసతి గృహం, హన్మకొండలో, జూన్ 10, 11 తేదీల్లో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ, హన్మకొండలో ఎంపిక నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 12న హాకీ అకాడమీ, వనపర్తి డా.బాలకృష్ణయ్య మినీ స్టేడియం, వనపర్తిలో హాకీ ఎంపిక అదేవిధంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఖమ్మంలో జూన్ 12న అథ్లెటిక్స్ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. 10 నుంచి 12 సంవత్సరాల వారికి జిమ్నాస్టిక్ మరియు స్విమ్మింగ్ ఎంపిక, 12 నుంచి 16 సంవత్సరాల వారికి అథ్లెటిక్స్, సైక్లింగ్, హ్యాండ్ బాల్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్ విభాగాల్లో ఎంపికలు ఉంటాయని వివరించారు.

కార్పొరేట్‌కు దీటుగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిగి పట్టణానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయడం సంతోషించ దగ్గ విషయమన్నారు. తుంకుల్‌గడ్డలో భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్‌చైర్మన్ అయూబ్, దోమ పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడడి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు రాజపుల్లారెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కుల్కచర్ల: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కుల్కచర్లలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వీరస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్య క్షుడు రాంచందర్ నాయక్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, నాయకులు రాంరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

దోమ: ప్రభుత్వ సబ్సిడీపై ఇచ్చే పచ్చి రొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం దోమ మండలం దిర్సంపల్లి రైతు సేవ కేంద్రంలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ నేతలతో కలసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సేవ కేంద్రంలో 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. బస్తాకు రూ.2,140 ధర ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్యాగౌడ్, కాంగ్రెస్ నేతలు సత్తయ్యగౌడ్, రాములుగౌడ్, బందయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అఖిల్‌పాష, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీకి పక్కాగా ఏర్పాట్లు

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 5,308 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరిగి పట్టణంలో 3 కేంద్రాలు, తాండూరులో 7, కొడంగల్‌లో ఒకటి, వికారాబాద్‌లో 5, మోమిన్‌పేట్, కుల్కచర్లలో రెండు కేంద్రాల చొప్పున ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థులకు తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదన్నారు. సమావేశంలో డీఈఓ రేణుకాదేవి, డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మర్పల్లికి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మర్పల్లి: మండల కేంద్రానికి గురువారం ఉదయం 11 గంటలకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రానున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో నిర్మించిన ఐటీఐ కళాశాల భవనాన్ని పరిశీలించేందుకు వస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, మండల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

బడులకు పాఠ్య పుస్తకాలు


పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీ రాందాస్

దుద్యాల్: బడుల ప్రారంభం నాటికి పాఠ్య పుస్తకాలు చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇదివరకే మండల విద్యావనరుల కేంద్రానికి నూతన పుస్తకాలు చేరాయి. దీంతో పాఠశాలలకు వాటిని పంపిణీ చేసే పనిలో సీఆర్‌పీలు నిమగ్నమయ్యారు. అందులో భాగంగానే మండల పరిధిలోని చెట్టుపల్లి తండాలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు బుధవారం పంపిణీ చేశారు. రెండు పాఠశాలలకు కలిపి 2,400 పుస్తకాలు అందించినట్లు సీఆర్‌పీ రాందాస్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల పాఠశాలలకు వంట సామగ్రి సైతం పంపిణీ చేశారు.

బిల్లు ఎక్కువ వేశారన్నందుకు

- లైట్లు ఆర్పి మహిళలపై దాడి
- జూబ్లీహిల్స్‌లోని బేబీలాన్ పబ్‌లో ఘటన

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని బేబీలాన్ పబ్‌లో తాము ఆర్డర్ చేయని డ్రింక్స్‌కు బిల్ వేశారని ప్రశ్నించినందుకు సిబ్బంది కస్టమర్లపై దాడికి పాల్పడ్డారు. పబ్‌లో లైట్లు ఆర్పి తన తల్లి, చెల్లిపై దాడి చేశారని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మీనల్ మీను ఆరోపిస్తోంది. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మీనల్‌మీను మంగళవారం రాత్రి తన తల్లి, చెల్లితో కలిసి జూబ్లీహిల్స్‌లోని బేబీలాన్ పబ్‌కు వెళ్లింది. ఈ సందర్భంగా తాము తాగని డ్రింక్స్‌కు కూడా బిల్లు వేసినట్లు గుర్తించిన ఆమె పబ్ సిబ్బందిని ప్రశ్నించింది. దీంతో వారితో వాగ్వాదానికి దిగిన పబ్ నిర్వాహకులు సిబ్బందితో కలిసి పబ్‌లో లైట్లు ఆపేసి ఆమె తల్లి, చెల్లిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిపై ఆమె సోషల్ మీడియా వేదికగా వివరించింది. తాము ఆర్డర్ చేయని డ్రింక్స్‌కు బిల్ వేశారని అడిగినందుకు కొట్టారని, వీడియో తీస్తుంటే బెదిరించి లైట్లు ఆర్పేసి దాడి చేశారని పేర్కొంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పలువురు సిబ్బందిని విచారించారు. దాడికి పాల్పడింది బౌన్సర్లా..? సిబ్బందా అన్న దానిపై విచారణ కొనసాగుతోంది.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 3వ నెంబర్ ప్లాట్‌ఫామ్ ట్రాలీ పాత్‌వే రైల్వే ట్రాక్ ప్రక్కన బుధవారం ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు సుమారు 25 ఏళ్ల యువకుడు రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతుడి ఒంటిపై తెలుపు, నలుపు గల్ల చొక్కా, నీలిరంగు జీన్స్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కేరళ లాటరీ పేరుతో రూ.7.55 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగినికి కేరళ లాటరీ పేరుతో ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.7.55 లక్షలు స్వాహా చేశారు. దీనిపై బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదైంది. బాధితురాలికి (54) గత నెల 7న 'కేరళ లాటరీ' ప్రతినిధి పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మధ్యాహ్నం 2 గంటలకు తమ లాటరీ ఫలితాలు ప్రకటిస్తున్నామని చెప్పాడు. దీంతో ఆమె ఓ టికెట్ ఖరీదు చేశారు. అదే రోజు సాయంత్రం రూ.5 లక్షల లాటరీ గెల్చుకున్నట్లు ఆమెకు సమాచారం ఇచ్చాడు. ఆ మొత్తం తీసుకోవాలంటే ముందుగా కొన్ని పన్నులు చెల్లించాలంటూ ఓ లింకు పంపాడు. బాధితురాలు దానిని క్లిక్ చేయగా... లాటరీ గెల్చినట్లు, వివిధ పన్నులు చెల్లించాలని ఉంది. బాధితురాలు చెల్లించిన మొత్తం నామమాత్రమే నాన్ రిఫండబుల్ అని, మిగిలింది లాటరీ నగదుతో పాటు రిఫండ్ చేస్తామని నమ్మించారు. ఇలా ఆమె నుంచి రూ.7,55,220 డిపాజిట్ చేయించుకుని మోసం చేశారు.

సర్కారు వరం.. సన్న బియ్యం

- లక్షన్నర మందికి ఒకేసారి మూడు నెలల రేషన్
- జూన్‌లో పంపిణీకి శ్రీకారం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


రేషన్ దుకాణంలో బియ్యం తీసుకుంటున్న మహిళలు

కొడంగల్: నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో జూన్ ఒకటో తేదీ నుంచి ఒకేసారి మూడు నెలల రేషన్ బియాన్ని ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. లక్షన్నర మందికి ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేయడానికి శ్రీకారం చుట్టారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటారని, వారికి ఇబ్బంది లేకుండా ఒకేసారి చౌకధర దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు నియోజకవర్గంలో 90 రేషన్ దుకాణాల ద్వారా నెలకు 979 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 2,937 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వినియోగదారులకు పంపిణీ చేయనున్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి రేషన్ దుకాణాల ద్వారా ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా ఇస్తారు. బయోమెట్రిక్ ద్వారా పంపిణీ చేస్తున్నారు.

ఈ పాస్‌తో పంపిణీ

కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో 90 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 38,395 రేషన్ కార్డులు ఉన్నాయి. 1,46,700 మంది లబ్ధిదారులు ప్రతి నెలా 979 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా బియ్యం తీసుకుంటున్నారు. రేషన్ దుకాణాల్లో అక్రమాలను అరికట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈపాస్) యంత్రాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఐరిష్, వేలిముద్రలు సరిగ్గా ఉంటేనే సరుకులు ఇస్తారు.

సిగ్నల్స్ సమస్య..

పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామాల్లోనే రేషన్ దుకాణాలు అధికంగా ఉన్నాయి. పట్టణాల్లో సెల్ ఫోన్ టవర్స్ ఉండడం వల్ల సమస్య లేదు. గ్రామాల్లో సిగ్నల్స్ అందక ఈ పాస్ యంత్రాల్లో తరచూ సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పలు గ్రామాల్లో సిగ్నల్స్ సరిగ్గా రావడం లేదని లబ్ధిదారులు, డీలర్లు చెబుతున్నారు. అతి కష్టం మీద సిగ్నల్ వస్తే సర్వర్ డౌన్ అవుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో సరుకుల పంపిణీలో జాప్యం జరుగుతోందన్నారు. కూలీ పనులు వదిలేసి బియ్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. అన్ని దుకాణాల్లో ఈ పాస్ యంత్రాలను ఏర్పాటు చేశారు. దీంతో సరుకులు పంపిణీ చేస్తున్నారు.

ఇబ్బంది లేకుండా..



వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని ఒకేసారి జూన్ నెలలో పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. డీలర్లు సకాలంలో దుకాణాలను తెరిచి, ప్రజలకు అందుబాటులో ఉండాలి. మూడు నెలల బియ్యాన్ని ఇవ్వాలి.

– విజయ్‌కుమార్, తహసీల్దార్

పైపు పగిలి.. నీరంతా వృథా



దోమ: మిషన్ భగీరథ పైపులైన్ పగిలి తాగు నీరంతా వృథాగా పోతుంది. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో రెండు రోజులుగా నీరు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో తాగునీరు అందక స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాల్సి ఉండగా కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దళిత రైతుపై దౌర్జన్యం సరికాదు


భూమి పరిశీలనకు వెళ్తున్న ప్రజా సంఘాల నాయకులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని బాపన్‌చెరువు తండాకు వేసిన బీటీ రోడ్డు నిర్మాణంలో రేగడిమైలారానికి చెందిన దళిత రైతు కడంపల్లి బాలయ్యపై కాంట్రాక్టర్ హన్మంత్‌రెడ్డి దాడి చేయించడాన్ని ప్రజాసంఘాల నేతలు తప్పుబట్టారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు దస్తయ్య ఆధ్వర్యంలో క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలయ్యకు చెందిన 10 గుంటల పట్టా భూమి రోడ్డు నిర్మాణంలో కోల్పోవడంతో రూ.15 లక్షల వరకు నష్టపోతున్నారని తెలిపారు. దీనిపై రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు కాంట్రాక్టర్‌పై అట్రాసిటి కేసు నమోదు చేయాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సంఘాల పక్షాన ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య, అంబేడ్కర్ ప్రజాసంఘాల తాలుకా అధ్యక్షుడు రమేష్‌బాబు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం నాయకుడు కొత్తూరు చంద్రయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, బాలరాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



జీలుగ విత్తనాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

దుద్యాల్: రైతులు జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జీలుగ విత్తనాలను వ్యవసాయ అధికారి నాగరాజ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ విత్తనాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెంటయ్య, ఏఈఓలు భావన, రేణుక, మాణికేశ్వరి, జ్యోతి, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, నాయకులు సీతారాంనాయక్, వెంకటయ్య, శ్రీశైలంగౌడ్, ఖాజా, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రాజేందర్‌కు డాక్టరేట్

సాక్షి,సిటీబ్యూరో: జేఎన్టీయూ హైదరాబాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్‌కు డాక్టరేట్ లభించింది. 'ఎఫెక్ట్ ఆఫ్ అక్యూట్ మారథాన్ రన్నింగ్ ఆన్ ది అప్పర్ రెస్పిరేటరీ -ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ స్టేటస్ అండ్ లంగ్ ఫంక్షన్ స్టేటస్ అమాంగ్ ది రిక్రియేషనల్ రన్నర్స్ ' అనే పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ రాజశేఖర్, జేఎన్టీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ యార్లగడ్డ గోపికృష్ణ పర్యవేక్షణలో, ఎక్స్ టర్నల్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ డాక్టర్ వాసంతి సమక్షంలో గ్రంథాన్ని సమర్పించడంతో జేఎన్టీయూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్ రావు రాజేందర్‌కు డాక్టరేట్ ప్రకటించారు. రాజేందర్ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం బాలుర ప్రభుత్వ పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


కవర్ల కింద ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై డీటీ శ్రీనివాస్

ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం తడిస్తే కొనమంటూ నిర్వాహకులు పేర్కొంటున్నారని చెప్పుకొచ్చారు. 40 కిలోల బస్తాకు రెండున్నర కిలోల వడ్లు అదనంగా ఇస్తేనే రైస్‌మిల్లు యజమాని తీసుకుంటారని వెలుగు సీసీ యాదయ్య సూచించడంతో కొంత సేపు గందరగోళం నెలకొంది. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ కలుగజేసుకొని విషయాన్ని సద్దుమణిగించారు. అనంతరం తడిసిన ధాన్యాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు.

పశువులకు వైద్యం అందించండి

సంచార అంబులెన్స్ జిల్లా అధికారి భాగేష మిశ్రా



సంచార అంబులెన్స్ వద్ద సిబ్బందితో అధికారి

పరిగి: పశువులకు సకాలంలో వైద్యం అందించాలని సంచార అంబులెన్స్ జిల్లా అధికారి భాగేష మిశ్రా సిబ్బందికి సూచించారు. బుధవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సంచార అంబులెన్స్‌లను మండల పరిధిలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో ఎలాంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని, వైద్యులు ఎల్లప్పుడు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. రైతులు పశువులకు ఏమైన సమస్య ఉందని కాల్ చేస్తే వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పశువైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ కామర్స్ దిగ్గజం ప్రొ.రామకృష్ణ శర్మ కన్నుమూత


ప్రొ.రామకృష్ణ శర్మ (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ దిగ్గజం ప్రొ.రామకృష్ణ కన్నుమూశారు. ఓయూలో ఎంకాం పూర్తి చేసి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అందుకున్న మొదటి విద్యార్థిగా గుర్తింపు పొందారు. అధ్యాపకుడిగా బోధనతో పాటు పరిశోధనలు, పాలన పదవులు నిర్వహించారు. గురువారం ఆయన అంత్యక్రియలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

'ప్రైవేటు' దందా!

- పదో తరగతి పాసైన విద్యార్థులే లక్ష్యంగా ప్రైవేటు కళాశాలల క్యాంపెయిన్
- పోటాపోటీగా ఇంటింటా ప్రచారం
- ఫీజు మినహాయింపంటూ తాయిలాలు
- ఆఫర్లతో అదరగొడుతున్న యాజమాన్యాలు
- అదే బాటలో ప్రైవేటు స్కూళ్లు



తాండూరు: పదో తరగతి పాసైన విద్యార్థులే లక్ష్యంగా ప్రైవేటు కళాశాలలు వల వేస్తున్నాయి. మా కాలేజీలోనే చేర్పించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులపై యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నారు. పది ఫలితాలు వచ్చింది మొదలు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల జాబితాను సేకరించి పెట్టుకున్నారు. బ్యానర్లు, పోస్టర్లు చేత పట్టి.. కరపత్రాలు పంచుతూ ఇంటింట ప్రచారం చేస్తున్నారు. ఫీజుల మినహాయింపు, ఆఫర్లతో ఊదరగొడుతున్నారు. ఒకరి తర్వాత ఒకరు ఇళ్లకు వస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొంది.

జిల్లాలో 9,502 మంది ఉత్తీర్ణత

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 307 ఉన్నాయి. వీటిలో గత మార్చి 12,846 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. 9,502 మంది ఉత్తర్ణత సాధించారు. ప్రస్తుతం వీరు కళాశాలల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు కళాశాలలు మా కాలేజీలో చేరితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఐఐటీ బోధన ఉందంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఆయా కాలేజీల్లో వచ్చిన ఒకరిద్దరి ర్యాంకులతో ప్రచారం హోరెత్తిస్తున్నారు.

ప్రభుత్వ కాలేజీలను బలోపేతం చేయని అధికారులు

పేద, మధ్య తరగతి కుటుంబాలు వారి పిల్లలను ప్రైవేటు కళాశాలల్లో చదివించాలంటే బోలెడు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవం కలిగిన లెక్చరర్లు ఉంటారు.. ఫీజులు సైతం ఉండవు.. నాణ్యమైన బోధన అందుతుంది.. కానీ వీటిని ప్రచారం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ప్రైవేటు వైపే మక్కువ చూపుతున్నారు. తాండూరు పట్టణం, పెద్దేముల్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. మిగతా మండలాల్లో కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థులు చేరేలా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

ఇదే బాటలో ప్రైవేటు స్కూళ్లు

జూన్ 12నుంచి విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలలు సైతం విద్యార్థులను చేర్చుకునేందుకు ఇంటింటి ప్రచారం చేస్తున్నాయి. ఉదయం 7 గంటల దాటింది మొదలు ప్రైవేటు పాఠశాలల సిబ్బంది వీధుల్లో దర్శనమిస్తున్నారు. తమ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. ఫీజులు తగ్గిస్తామని ప్రచారం చేస్తున్నారు.

భారీ వర్షం.. అతలాకుతలం


వికారాబాద్ పట్టణ కేంద్రంలోని అష్రాఫ్‌బాగ్ కాలనీలో వర్షపు నీరు

మండలం	వర్షపాతం(మి.మీ)
1.వికారాబాద్	46.3
2.దోమ	43
3.బషీరాబాద్	40.8
4.పూడూర్	39.8
5.మోమిన్‌పేట్	25.8
6.నవాబ్‌పేట్	22.5
7.యాలాల్	20.8
8.బొంరాస్‌పేట	20
9.మర్పల్లి	20
10.కోట్‌పల్లి	19.3
11.బంట్వారం	16.5
12.పెద్దేముల్	15.5
13.కొడంగల్	14.5
14.చౌడాపూర్	13.5
15.కుల్కచర్ల	12.5
16.తాండూర్	12.3
17.ధారూర్	11
18.దౌల్తాబాద్	8
19.పరిగి	5.5

- జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వానలు
- రైతులకు తప్పని తిప్పలు

పరిగి: జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో బుధవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. పలు చోట్ల చెరువులు, కుంటల్లో వర్షం నీరు చేరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వర్షాలు ముందస్తుగానే కురుస్తున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు మొలకెత్తుతున్నాయి. మరో రెండుమూడు రోజులు వర్షాలు కురిస్తే రైతులకు చాలా నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

మర్పల్లిలో మోస్తరు

మర్పల్లి: మండలంలోని బూచన్‌పల్లి, కొత్లాపూర్, మర్పల్లి, సిరిపురం, కోట్‌మర్పల్లితో పాటు పలు గ్రామాలలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు నిలువడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ పొలాల్లో నీరు చేరి పనులకు ఆటంకం కలిగిందని రైతులు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


అనసూయ (ఫైల్)

మోతీనగర్: భవన నిర్మాణ పని చేస్తున్న మహిళ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సామల వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సఫ్దార్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో గుంపు అనసూయ (45) అనే మహిళ కూలీ పని చేస్తోంది. బుధవారం ఆమె మెటీరియల్ లిఫ్ట్ వద్ద పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. తోటి కూలీలు ఆమెను ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. యజమాని నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రతి నిరుద్యోగికి ఉపాధి కల్పిస్తాం

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- నేడు తాండూరులో మెగా ఉద్యోగమేళా


ఉద్యోగ మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: నియోజకవర్గంలో ప్రతి నిరుద్యోగికి ఉపాధి కల్పనకు మెగా ఉద్యోగమేళాను గురువారం నిర్వహిస్తున్నట్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వినాయక కన్వెన్షన్‌లో మెగా ఉద్యోగమేళా నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న తాండూరు నియోజకవర్గంలో యువతకు ఉద్యోగాలు కల్పించడంలో నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా 54 కంపెనీలను సంప్రదించి మెగా ఉద్యోగమేళాతో 11 వేల ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వయసు కలిగిన వారు ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్యతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం ఈజీఎంఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అధికార యంత్రాంగం పాల్గొంటుందన్నారు. తాండూరులో నిర్వహించే మెగా ఉద్యోగ మేళాను ఆదర్శంగా చేసుకొని జిల్లాలోని కొడంగల్, వికారాబాద్‌లలో ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ సిద్ధమవుతున్నారన్నారు. మేళాలో ఉద్యోగాలు వచ్చిన వారికి నెల రోజుల పాటు వసతి, భోజన సౌకర్యాలు ఉచితంగా అందిస్తారన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, పార్టీ బీసీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, నాయకులు నర్సింహులు, లొంక నర్సింహులు, జుబేర్‌లాల, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.